# ముందుకు పోదాం (...వెనుక నుంచి)

- సారధి మోటమఱ్ఱి, సిడ్నీ.

**Mar-2007.**

మనం ముందుకు ముందుకు -
కలిసి కలిసి వెళ్ళలేము;
కలిసి మెలిసి ఉండలేము;
వెనక్కు వెనక్కు వెడదామా?

దేశభాషలందు తెలుగు లెస్సయని,
కన్నడ రాయలు స్తుతిస్తే -
భాషలందు తెలుగు లెస్సుయని,
తెలుగు వారలు చాటుదాము!

ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టుయని -
బ్రౌను తెలుగును కొనియాడితే -
ఆంధ్రమును అంధకార అంచులకు,
అంధులుగా తోడ్కొని పోదాము!

ముష్కర రాజకీయాలతో,
ముక్కలు చెక్కలైన ఆంధ్రులు -
ముచ్చటగా ఒక్కటి కావాలని,
మృత్యువుకు చిక్కాడు శ్రీరాములు!

పదవి కోసం... స్వలాభం కోసం...
ఒక్కటైన త్రిలింగ ఆంధ్రావనిని -
మూడు ముక్కలుగా పంచుతానంటే -
ఒక్కరుగా కారా ముప్వురు ఆంధ్రులు?

తెలుగు మాట, తెలుగు సంస్కృతి...
కూడు బెట్టేనా? కొరత తీర్చేనా?
పంచుకుందాము తెలుగుతల్లిని -
జైకొట్టు - తెలుగోడు చరితంగా!!